క్లుప్తంగా

బాలల హక్కులపై అవగాహన



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు లింగ వివక్ష, బాలల హక్కులపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి రమాదేవి మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్ష నేరమని, విద్యతో సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. లింగానిర్ధారణ పరీక్షలు ప్రోత్సహించినా, నిర్వహించినా చట్టరీత్యా నేరమని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా సీపీఆర్‌పై, బ్యాడ్ టచ్ గుడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మాదలలో జరిగిన ఆటల పోటీల్లో పతకాలు సాధించిన వారికి ఎంపీడీవో రత్నం, వైద్యాధికారి రమాదేవి షీల్డ్‌లు అందించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ దస్తగిరి, పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆట పరికరాలు అందజేత



అచ్చంపేట: వేల్పూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థుల క్రీడాభివృద్ధికి గ్రామానికి చెందిన కొప్పాకుల నరేంద్రబాబు రూ.15వేలు విలువచేసే క్రీడా సామగ్రిని మంగళవారం పాఠశాల హెచ్ఎం అగస్టీన్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా బాగా రాణించాలని తాత, నానమ్మ కొప్పాకుల వెంకయ్య, నరసమ్మలు కలలు కనేవారన్నారు. క్రీడలతో చదువులపై ఏకాగ్రత పెరుగుతుందని నమ్మేవారన్నారు. వారి జ్ఞాపకార్థం బ్యాడ్మింటన్, వాలీబాల్, చెస్ తదితర సామగ్రిని పాఠశాలకు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పొన్నెకంటి వెంకయ్య, నలజాల పిచ్చయ్య, ఉపాధ్యాయులు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పణిదం ఘటనపై ఉన్నతాధికారుల ఆరా

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం పణిదం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివే ఓ బాలికపై పాఠశాలలో జీవ శాస్త్రం బోధించే ఉపాధ్యాయుడు వ్యవహరించిన తీరుపై ఉన్నతాధికారులు మంగళవారం ఆరా తీశారు. జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ ఆదేశాల మేరకు స్థానిక విద్యాశాఖ అధికారులు పాఠశాలలో జరిగిన ఘటనపై వాస్తవ నివేదికను పంపినట్లు సమాచారం. బాలికకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా నివేదికను తయారుచేసి తిరిగి మళ్లీ పాఠశాలకు ఆ ఉపాధ్యాయుడు వెళ్లకుండా ఉండటంతో పాటు సస్పెన్షన్‌కు రంగం సిద్ధం చేశారు. ఇది ఇలా ఉంటే సత్తెనపల్లి రూరల్ పోలీసులు విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డులో మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం గుడిపూడి నుంచి ఆటో వస్తుండగా, అదే సమయంలో సత్తెనపల్లి నుంచి ద్విచక్ర వాహన చోదకుడు వెళ్తుండగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ క్రమంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ద్విచక్ర వాహన చోదకుడిని గుంటూరు ఆస్పత్రికి తరలించగా.. ఆటో డ్రైవర్‌ను సత్తెనపల్లి ప్రైవేట్ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు ఘటనపై సమాచారం సేకరిస్తున్నారు.

ప్రతి ఇంటిలో జ్ఞానజ్యోతి



నకరికల్లు: త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రతి ఒక్కరూ చదివి ఆత్మజ్ఞానం పెంపొందించుకోవచ్చని ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిన పిడుగురాళ్ల కమిటీ , చిలకలూరిపేట కమిటీల అధ్యక్షులు కటరం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు తెలిపారు. మండలంలోని నర్సింగపాడులో మంగళవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీపావళి పండుగ రోజున ప్రతిఇంటిలో జ్ఞానజ్యోతి దీపాలను వెలిగించాలని తెలిపారు. కార్యక్రమంలో జ్ఞానవేదిక సభ్యులు కె.అరుణ, కె.కార్తీక్, కె.నారాయణమ్మ, సీహెచ్ అనురాధ, ఎస్.వెంకటలక్ష్మి, డి.శ్రీను, ఎమ్ వీరయ్య, టి.రాఘవ, వి.సుందరం, వై. రామాంజనేయులు, కె.గంగయ్య, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిపై నిర్లక్ష్యం

- మండలంలో పలు పాఠశాలల్లో నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం
- నాడు–నేడు ఫేజ్–2లో నిధులు మంజూరైనా నిర్మాణంలో జాప్యం



నకరికల్లులోని ఎంపీపీ మెయిన్ పాఠశాలలో నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం

నకరికల్లు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. అక్షరాస్యతను పెంచేందుకు, భావిభారత పౌరులను తీర్చిదిద్దేందుకు పాఠశాల విద్యే కీలకం. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచిత నిర్బంధ నాణ్యమైన విద్యను ప్రజలకు ఇవ్వాల దేశానికి గొప్ప విద్యావంతులను అందించాలి.. దానికి పాఠశాల నుంచే పునాదివేయాలన్న గొప్ప తలంపుతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు లాంటి మహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించింది. శిథిలావస్థలో ఉన్న ఎన్నో పాఠశాలల రూపురేఖలు మార్చింది. కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన తరగతి గదులు, ఫర్నిచర్, బోధనా పద్ధతులు, నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థంగా అమలు చేసింది. ఎన్నికల కారణంగా మండలంలో ఫేజ్–2లో తరగతి గదుల నిర్మాణ పనులు నిలపాల్సిన పరిస్థితి అనివార్యంగా ఏర్పడింది. ఎన్నికల అనంతరం ఉన్న నిధులతో భవనాలు నిర్మించడంలో కూడా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది.

పురోగతి లేదు

మండలంలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 51 ఉన్నాయి. వీటిలో 42 ఎలిమెంటరీ స్కూళ్లు, 9 హైస్కూళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు 5,520 మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడానికి నాడు–నేడు పనులను ఫేజ్–1, ఫేజ్–2లుగా విభజించారు. ఫేజ్–1లో పనులను నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పూర్తి చేసింది. ఫేజ్–2లో పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. కోడ్ అమల్లోకి రావడంతో పనులు ఆపాల్సి వచ్చింది. ఆ తర్వాత అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం పాఠశాలలను విస్మరించడంతో పురోగతి లేదని విమర్శలు వస్తున్నాయి.

పనులు నిలిచిన పాఠశాలలివే..

కొన్నిచోట్ల పనులు అరకొరగానే సాగుతున్నాయి. గుండ్లపల్లి హెచ్‌డబ్ల్యూ, ఆర్‌వీఎం ఎంపీపీఎస్, ఎల్ పాఠశాల, నకరికల్లు ఏఏ పాఠశాల, హెచ్‌ఈ పాఠశాల, పీడబ్ల్యూడీ పాఠశాల, చల్లగుండ్ల ఎంపీపీఎస్(ఎస్సీ), ఎంపీపీఎస్ మెయిన్, ఉన్నతపాఠశాల, ఎంపీపీఎస్ అడ్డరోడ్డు, చీమలమర్రి ఎంపీపీఎస్ ఏఏ పాఠశాల, కండ్లకుంట ఎంపీపీ ఎస్ పాఠశాల, చాగల్లులోని ఎంపీపీఎస్ ఎస్టీ, రూపెన గుంట్లలోని ఎంపీపీఎస్ హెచ్‌డబ్ల్యూ, దేచవరంలోని ఎంపీపీఎస్ ఏఏ, ఈసీ పాఠశాలలు, కుంకలగుంటలోని ఎంపీపీఎస్ ఏఏ, చేజర్లలోని ఎంపీపీఎస్ హెచ్‌డబ్ల్యూ, ఉన్నతపాఠశాలల్లో పనులు ఇంకా చేపట్టాల్సి వస్తుంది.



గుండ్లపల్లి ఉన్నత పాఠశాలలో నిలిచిన గదుల నిర్మాణం

మండల వ్యాప్తంగా సుమారు 65శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇందులో ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీ హయాంలో చేపట్టిన నిర్మాణ శాతమే సింహభాగం కావడం గమనార్హం. పాఠశాలల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వ చిన్నచూపు కారణంగా ఈ ఏడాది సంపూర్ణమైన మౌలిక వసతులతో కూడిన విద్య అందని ద్రాక్షగా మారిందనే విమర్శలను కూటమి ప్రభుత్వం ఎదుర్కొంటోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అదనపు తరగతి గదులు పూర్తిచేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఐక్యంగా జీవించండి

సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు



కోటనెమలిపురి గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ

రాజుపాలెం: గ్రామాల్లో అందరూ కలసిమెలసి జీవించాలని సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు గ్రామస్తులకు సూచించారు. మండలంలోని కోటనెమలిపురిలో సత్తెనపల్లి డీఎస్పీ ఆధ్వర్యలో మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఉదయం 7 గంటలకు డీఎస్పీ, సత్తెనపల్లి రూరల్ సీఐ పి.కిరణ్ సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, 70 మంది పోలీస్ సిబ్బందితో గ్రామానికి చేరుకుని జల్లెడ పట్టారు. గ్రామ రోడ్లలో కవాత్ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో డీఎస్పీ మాట్లాడుతూ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు తిరుగుతుంటే తమ దృష్టికి తేవాలని తెలిపారు. గొడవులు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సీ కాలనీ సమీపంలోని బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ల విగ్రహాల వద్ద ఉన్న ఖాళీ స్థలం గూర్చి తహసీల్దార్ ఇరువర్గాలతో మాట్లాడతారని, అల్లర్లు సృష్టించుకోవద్దని, సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ స్వర్ణమ్మభాయ్

అచ్చంపేట: మండలంలో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి సంబంధిత అధికారులంతా కృషి చేయాలని ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మభాయ్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. వివిధ శాఖల పురోగతిపై అధికారులు ప్రగతి నివేదికలను సభ ముందుంచారు. మండలంలోని కొన్ని ఆరోగ్య ఉప కేంద్రాల్లో నామమాత్రపు మందులు కూడా ఉండటంలేదని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. తాళ్లచెరువు సబ్ సెంటర్‌లో పారాసెట్మాల్ టాబ్లెట్స్ కూడా లేకపోవడంపై సభ్యులు మండి పడ్డారు. మరికొన్ని గ్రామాల్లో మంచినీరు రావడంలేదని, అధికారులు పట్టించుకోవడంలేదని సభ్యులు ప్రశ్నించారు. రోకటిగుంటవారిపాలెంలో మంచి నీటి సమస్య ఎప్పటి నుంచో ఉందని, గత సమావేశాల్లో కూడా ఈ విషయంపై ప్రస్తావించినా ఎలాంటి చర్యలు లేవని సర్పంచ్ రామకృష్ణ తెలిపారు. మండల కేంద్రమైన అచ్చంపేటకు వివిధ పనులపై గ్రామాలనుంచి ప్రజలు వస్తుంటారని వారికి సరైన టాయిలెట్స్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ్యులు తెలిపారు. వెంటనే అచ్చంపేటలో సరైన స్థలం చూసి పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని కోరారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ స్వర్ణమ్మభాయ్.. ఎంపీడీవో శ్రీనివాసరావుకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.చంద్రశేఖర్, ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గంగసాని నరసింహారెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బాబు పాలనలో వైద్య విద్య నిర్వీర్యం

- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ రద్దు చేసే వరకూ పోరాటం
- వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి
- రెంటపాళ్లలో కోటి సంతకాల సేకరణ




రెంటపాళ్లలో కోటిసంతకాల సేకరణలో మాట్లాడుతున్న డాక్టర్ సుధీర్ భార్గవరెడ్డి

సత్తెనపల్లి: ప్రభుత్వ వైద్య విద్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వీర్యం చేస్తున్నారని, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను రద్దు చేసే వరకూ ఈ పోరాటం సాగుతుందని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో మంగళ వారం రాత్రి నిర్వహించిన కోటి సంతకాల సేకరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సుధీర్ భార్గవరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకొచ్చారన్నారు.

దోపిడీకి తెర తీసిన చంద్రబాబు

ఈ రోజు చంద్రబాబు వాటిని తన బినామీలకు అప్పగించి దోపిడీకి తెరతీశారన్నారు. జగనన్న హయాంలో ఐదు కళాశాలల్లో అడ్మిషన్లు మొదలు పెట్టి తరగతులు కూడా జరుగుతున్నాయని చెప్పారు. మిగిలిన 12 కాలేజీలను చంద్రబాబు ప్రభుత్వం పీపీపీ విధానంలో తన వర్గీయులకు దారాదత్తం చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పక్కాల సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తీసుకు వచ్చిన మెడికల్ కళాశాలలను ఈ ప్రభుత్వం ప్రైవేటీకరించాలని చూస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నుంచి కోటి సంతకాల సేకరణ చేపట్టాలని పార్టీ అధిష్ఠానం పిలుపు నిచ్చిందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణతో ప్రజలకు ఎలాంటి నష్టాలు, ఇబ్బందులు వస్తాయి... ప్రభుత్వం ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలలు నడిపితే ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయనే విషయాలపై ప్రజలకు వివరించారు. నియోజకవర్గ పరిశీలకుడు పడాల శివారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, యువజన విభాగం నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కళ్ళం విజయ భాస్కరరెడ్డి, పాకాలపాడు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కొర్లకుంట వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షుడిగా కొర్లకుంట శ్రీనివాసరావుతో పాటు గ్రామ, అనుబంధ కమిటీలను ప్రకటించారు. ముందుగా కూటమి నేతల దాడులు, పోలీసుల వేధింపుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన ఉప సర్పంచ్ కొర్లకుంట నాగమల్లేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి చిలుకా జైపాల్, మండల పార్టీ నాయకులు సంకటి శ్యాంసన్, అన్నదాసు శ్రీనివాసరావు, కొమెర శివశంకర్, చల్లా శ్రీను, బొంతు వెంకటరెడ్డి, నతానియేలు, గ్రామసర్పంచ్ ఏకుల మనీషా, నాయకులు ఏకుల మత్తయ్య, పల్లె గాబ్రియల్, మండ లంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్య కర్తలు, తదితరులు ఉన్నారు.



సంతకం చేస్తున్న కొర్లకుంట వెంకటేశ్వర్లు

జీఎస్టీ ప్రచారమే.. దక్కని ఊరట!

అమలు కావడం లేదని కొందరు, ధరలు ఏమీ తగ్గలేదంటున్న సామాన్యులు

క్రోసూరు: జీఎస్టీ తగ్గింపుపై పాలకుల ప్రచారమే గానీ.. సామాన్యుడికి ఊరట దక్కిన దాఖలాలు కానరావడం లేదు. కేంద్ర ప్రభుత్వం గత నెల 22 నుంచి జీఎస్టీ తగ్గింపు అమలు చేస్తున్నట్లు భారీ ప్రకటనలు, కూటమి ప్రభుత్వం గ్రామ గ్రామాల్లో సంబరాలు చేసుకోవడమేగానీ అసలు ఎక్కడ తగ్గింది, ఎలా మేలు జరిగిందో తెలియడం లేదని సామాన్యుల నుంచి వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మండలంలో పీహెచ్‌సీ అధికారులు, ఎంపీడీవో కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీలు పెద్ద ఎత్తున రోజూ ప్రచారం చేయడమేగానీ ఎక్కడ అమలు జరుగుతుందో పరిశీలించేవారే లేరని ప్రజలు వాపోతున్నారు. పెద్ద మొత్తంలో విలువ చేసే ఎలక్ట్రానిక్ వస్తులు జీఎస్టీ 18 నుంచి 5 శాతంకు తగ్గిందన్న ప్రచారాలు హోరెత్తుతున్నాయి. కొద్ది మందికి మాత్రమే టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీల ధరలు కొంత తగ్గినట్లు తెలుస్తోంది. ప్రాణాధార మందులు షుగర్, బీపీ, గుండె, తదితర రోగాలకు పని చేసే మందుల ధరలపై జీఎస్టీ పూర్తిగా తొలగించారని ప్రభుత్వం చెబుతున్నా.. ఇప్పటికీ దుకాణాల్లో పాతధరలకే విక్రయిస్తుండటంతో సామాన్యులకు అర్థం కాని పరిస్థితి నెలకొంది. దుకాణాల ఎదుట తగ్గించిన ధరల వివరాల పట్టికలు ప్రకటించాలని అధికారులు చెప్పడమేగానీ అవి అమలు చేయటం లేదని ప్రజలంటున్నారు. నిత్యావసర సరుకుల ధరలు కూడా యథావిధిగా విక్రయిస్తున్నారు. జీఎస్టీ తగ్గిందని, ధరలు తగ్గుతాయని ఎందుకు ప్రచారం చేస్తున్నారో అర్థం కావడం లేదని సామాన్యులంటున్నారు. వ్యాపారులపై సంబంధిత అధికారులు పటిష్ఠ నిఘా, పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

పరిశుభ్రతతో కూడిన పచ్చదనం పెంపొందించాలి



శిక్షణ అనంతరం సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి

సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ సజావుగా ఉండాలని, పరిశుభ్రతతో కూడిన పచ్చదనం పెంపొందించాలని సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీని వాసరెడ్డి పిలుపునిచ్చారు. సత్తెనపల్లి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో థీమ్ 5 అయిన పరిశుభ్రత, పచ్చదనంపై సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇలా చేస్తే ఎల్ఎస్‌డీజీ థీమ్ 5 క్లీన్ అండ్ గ్రీన్ లక్ష్యాన్ని అందుకున్నట్లేనన్నారు. పాలిథిన్ వ్యర్థాల నిర్వహణ సజావుగా జరగాలని పిలుపునిచ్చారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో జరిగే అన్ని కార్యక్రమాలపై అవగాహన ఉండాలన్నారు. శిక్షణలో భాగంగా పరిశుభ్రత –పచ్చదనం, ఘన వ్యర్థాలు, పాలిథిన్ వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛ రథం, హరిత రాయబారుల హక్కులు, అవకాశాలు అనే అంశాలపై అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్లుగా డెప్యూటీ ఎంపీడీఓ షేక్ అజీజుర్ రెహమాన్, పంచాయతీ కార్యదర్శులు కుంభ వెంకటేశ్వర్లు, కాల్వపల్లి అంజిరెడ్డి, చిలువూరి కృష్ణప్రసాద్ వ్యవహరించారు. క్లీన్ అండ్ గ్రీన్ శిక్షణ బుధవారం మండలంలోని హరిత రాయబారులకు, గురువారం యానిమేటర్లకు, శుక్రవారం స్వయం సహాయక సంఘాల సభ్యులకు మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపీడీఓ చెప్పారు.



శిక్షణలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, అధికారులు

క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై శిక్షణ

అమరావతి: మండల పరిధిలోని సర్పంచ్‌లకు, ఉపసర్పంచ్‌లకు, డిజిటల్ అసిస్టెంట్‌లకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు థీమ్ –5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంపై మండల పరిషత్ కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో పార్వతి మాట్లాడుతూ పరిశుభ్రమైన త్రాగునీటిని ప్రజలకు అందించడంపై గ్రామాల్లో పారిశుద్ధ్యంపై తీసుకోవాల్సినప్రత్యేక చర్యలు, మంచినీటి క్లోరినేషన్ వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయించడం, గ్రామంలోని వీధుల పరిశుభ్రత ప్రతిరోజూ చెత్త సేకరణ, మొక్కలు నాటడం వీధి లైట్లు వంటి అంశాలపై తీసుకోవాల్సిన చర్యలపై శ్రద్ధ వహించాలన్నారు.
ప్రభుత్వ విధానాలు, వివిధ పథకాల ద్వారా నిధుల లభ్యత, ప్రణాళికబద్ధంగా నిధుల వినియోగం వంటి అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధుల అవగాహన, సమన్వయాన్ని వివరించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి



ముప్పాళ్ళ తహసీల్దార్‌కు వినతిపత్రం అంది స్తున్న కౌలు రైతు సంఘం నేత బాలకృష్ణ, తదితరులు



తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతుసంఘం ప్రతినిధులు

ముప్పాళ్ళ: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింప జేయాలని రైతు సంఘం నేత గుంటుపల్లి బాలకృష్ణ అన్నారు. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేశారు. బాలకృష్ణ మాట్లాడుతూ రైతులతో పాటే కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని, రుణ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కె.నగేష్‌కు అందించారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం నాయకులు తొరటి అమరలింగేశ్వరరావు, పెద్దిరెడ్డి, మారూరి జగన్మోహనరెడ్డి, ఓర్సు వెంకటేశ్వర్లు, జాన్‌పీరా, రైతులు పాల్గొన్నారు.

క్రోసూరులో..

క్రోసూరు: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ అందించాలని కోరుతూ క్రోసూరు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కౌలు రైతుసంఘం మండల నాయకులు మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించి, వారికి న్యాయం చేస్తామని కూటమి హామీ ఇచ్చి 18 నెలలు కావస్తున్నా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు చెల్లించి వారిని ఆదుకోవాలన్నారు. ఈ మేరకు అర్జీని తహసీల్దార్ వి.వి.నాగరాజుకు అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కమిటీ సభ్యులు కుంబా లక్ష్మయ్య, చింతకాయల నరసింహారావు, కుంభ కోటయ్య, పెరికల శ్రీను ఏపూరి వెంకటేశ్వర్లు, మల్లెల సేవిరి పాల్గొన్నారు.

బాలోత్సవాన్ని విజయవంతం చేయండి

శావల్యాపురం: జిల్లా స్థాయిలో నవంబరు 29, 30 తేదీల్లో బాలోత్సవ తృతీయ వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు బాలోత్సవ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసరావుపేట పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఈ వేడుకలు జరుగుతాయని ఇందులో ఎల్‌కేజీ నుంచి 10 తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలకు అర్హులన్నారు. మొత్తం 65 రకాల కార్యక్రమాలు లఘు నాటికలు, బుర్ర కథలు, మట్టి బొమ్మలు, కోలాటాలు, శాస్త్రీయ నృత్యాలు, సైన్సు ప్రయోగాలు, కథలు చెప్పటం తదితర వాటిపై పోటీలు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని ఉపాధ్యాయులను స్వయంగా కలిసి ఆహ్వానించుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, పాఠశాల సీనియర్ ఆంగ్ల బోధకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.